

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

డీఎస్ నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సైదాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. సోమవారం డీఎస్ నగర్‌లో రూ.37.85లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, నేతలు బొమ్మల ప్రశాంత్, దుర్గేష్, బస్తీ వాసులు బలరాం, కాశీరాం, యాదయ్య, శ్రీనివాస్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

రాక్‌టౌన్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి



కార్పొరేటర్ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న వినోద్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి

మన్సూరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాక్‌టౌన్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్‌కు కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్‌ను ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు మరికొన్ని నిధులు కేటాయించి పూర్తి చేయాలని, పార్కులో సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్, కాలనీ ఉపాధ్యక్షుడు టి.మణిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



బస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి చర్యలు : మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో మిగిలిపోయిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చంపాపేట డివిజన్‌లోని చంపాపేట ఓల్డ్ విలేజ్, యేడ బస్తీ, కటికోనికుంట బస్తీలలో సోమవారం కార్పొరేటర్ ఆయా శాఖల అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ లైన్ మరమ్మతులు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంత ప్రజలు కార్పొరేటర్‌ను కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, జలమండలి మేనేజర్ రమ్యభారతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, ఇబ్రహీం, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, బస్తీవాసులు దనం, రవి, కట్టా వెంకటేష్, చంద్రశేఖర్, లక్ష్మణ్, కృష్ణ, నాయకులు పాశం శ్రీశైలం పాల్గొన్నారు.

వరదనీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం



వరదనీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

వనస్థలిపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరదనీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో చేపడుతున్న వరదనీటి పైప్‌లైన్ పనులకు సంబంధిత అధికారులతో కలిసి సోమవారం కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ద్వారకమయినగర్ కాలనీలో..

హయత్‌నగర్ డివిజన్ ద్వారకమయినగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సోమవారం కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రవీణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేటలో సమస్యల పరిష్కారంలో జాప్యం

కొత్తపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో సమస్యల పరిష్కార పనుల్లో జాప్యం జరుగుతోందని కార్పొరేటర్ పవన్‌కుమార్ సోమవారం ప్రజావాణిలో అధికారులకు విన్నవించారు. కాలనీల్లో పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, తరచూ తలెత్తుతున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సత్వరచర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు విన్నవించారు. ఎక్కువ సామర్థ్యం గల పైపులు వేయాలని, తగిన నిధులు మంజూరు చేయాలని జలమండలి జీఎం బలరామ్‌ను కోరారు. అదే విధంగా ఎస్ఆర్ఎల్ కాలనీలోని పురాతన భక్తాంజనేయ స్వామి ఆలయంలో తలెత్తిన సమస్యను ఆయన పరిశీలించారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అంతర్జాతీయ వైశ్యఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంక్షేమ సంఘం శారదానగర్ (దిల్‌సుఖ్‌నగర్) నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం శారదానగర్‌కాలనీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా విచ్చేసి నూతన కమిటీచే ప్రమాణస్వీకారం చేయించి అభినందించారు. శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యుల హక్కుల సాధనకు తానెప్పుడూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, బీజేపీ నేత మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా, సంఘం అధ్యక్షుడు మునుగొంటి ప్రభాకర్, ప్రధానకార్యదర్శి గుండ శ్రీధర్, కోశాధికారి వెంకటేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఒక పాలకవర్గంతోనే కార్పొరేషన్లు ఖతమ్..!

అవే మొదటి, చివరి పాలకవర్గాలుగా రికార్డు

మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు ఇక మాయం

గ్రేటర్‌లో విలీనం.. చార్మినార్, ఎల్బీనగర్ జోన్ల నుంచి పాలన



పారిజాతారెడ్డి, బడంగ్‌పేట్ మాజీ మేయర్



శేఖర్, బడంగ్‌పేట్ మాజీ డిప్యూటీ మేయర్



దుర్గాదీప్‌లాల్, మీర్‌పేట్ మాజీ మేయర్



విక్రమ్‌రెడ్డి, మీర్‌పేట్ మాజీ డిప్యూటీ మేయర్

సరూర్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆ పాలకవర్గాల చరిత్ర ఒక్కో పాలకవర్గంతోనే ముగిసిపోయింది.. అవే మొదటి, చివరి పాలకవర్గాలుగా రికార్డుల్లో నిలిచిపోనున్నాయి.. ఓ మేయర్, ఓ డిప్యూటీ మేయర్.. అంతే మళ్లీ ఎన్నికలు లేవు.. పాలకవర్గాలూ లేవు.. ఏకంగా గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం.. ఆ వెంటనే చార్మినార్, ఎల్బీనగర్ జోన్ల నుంచి పాలనకు శ్రీకారం! స్థూలంగా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల కథ ఇది!!

మీర్‌పేట్‌ది విచిత్ర పరిస్థితి

ఉమ్మడి సరూర్‌నగర్ మండలంలో పంచాయతీలుగా ఉన్న మీర్‌పేట్, జిల్లెలగూడ గ్రామాలను 2016లో రెండు వేర్వేరు మునిసిపాలిటీలుగా మార్చారు. అప్పటికే ఆయా గ్రామాలకు 2014లో మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించి మండల పరిషత్ పాలకవర్గాన్ని సైతం ఎన్నుకున్నారు. ఎంపీపీగా తీగల విక్రమ్‌రెడ్డి, వైస్ ఎంపీపీగా ఉమర్‌బామ్ ఎన్నికయ్యారు. అయితే, అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో ఈ రెండు గ్రామాలను వేర్వేరు మునిసిపాలిటీలుగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఓ పక్క మండల పరిషత్ పాలకవర్గం.. మరోపక్క మునిసిపాలిటీలుగా ప్రత్యేక అధికారుల పాలనతో మీర్‌పేట్, జిల్లెలగూడ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి కొనసాగింది. అప్పటి పాలకులు తీసుకున్న అసంబద్ధ నిర్ణయం కారణంగా సుమారు మూడేళ్లపాటు ఇక్కడ రాజకీయ అనిశ్చితి ఏర్పడి, అభివృద్ధి పూర్తిగా కుంటుపడి పోయింది. ఇక 2019లో మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగియగానే.. అప్పటి వరకు వేర్వేరు మునిసిపాలిటీలుగా కొనసాగిన మీర్‌పేట్, జిల్లెలగూడలను కలిపి 'మీర్‌పేట్' పేరుతో ఒకే కార్పొరేషన్‌గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మునిసిపాలిటీలుగా ఉన్నప్పుడు మండల పరిషత్ పాలకవర్గంతో.. మునిసిపల్ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగిన ఈ రెండింటినీ కార్పొరేషన్‌గా మార్చడంతో.. 2020లో మొదటిసారిగా మునిసిపల్ ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. 46 డివిజన్లు కలిగి ఉన్న మీర్‌పేట్ మేయర్‌గా దుర్గాదీప్‌లాల్ ఎన్నికవగా, డిప్యూటీ మేయర్‌గా సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ తీగల విక్రమ్‌రెడ్డి ఎన్నికయ్యారు. బడంగ్‌పేట్‌లాగే ఇక్కడ కూడా ఈ పాలకవర్గమే మొదటి, చివరిదిగా రికార్డుల్లో నిలిచిపోనుండగా.. మొదటి, చివరి మేయర్, డిప్యూటీ మేయర్లుగా సైతం వారే రికార్డుల్లోకి ఎక్కనున్నారు.

కార్పొరేషన్ కహానీ ఖతం

ప్రస్తుత ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు గ్రేటర్‌లో కలిసిపోయాయి. దాంతో వీటి 'కార్పొరేషన్ కహానీ' ఇంతటితో ఖతమ్ అయినట్టయింది. పాలనాసౌలభ్యం కోసం తాత్కాలికంగా మీర్‌పేట్‌ను ఎల్బీనగర్ జోన్‌లో, బడంగ్‌పేట్‌ను చార్మినార్ జోన్‌లో చేర్చారు. ఇక జీహెచ్ఎంసీలో విలీనంతో డివిజన్ల విభజన ఎలా ఉంటుందో అన్న చర్చ ప్రస్తుతం నడుస్తోంది.

2019లో కార్పొరేషన్లు ఏర్పాటు.. 2020లో పాలకవర్గాలు

ఉమ్మడి సరూర్‌నగర్ మండలంలో గ్రామ పంచాయతీలుగా కొనసాగిన బడంగ్‌పేట్, బాలాపూర్(పార్ట్), అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, వెంకటాపూర్, మామిడిపల్లి గ్రామ పంచాయతీలను కలిపి 2014లో నగర పంచాయతీగా ఏర్పాటు చేశారు. అదే ఏడాది ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. సామ నర్సింహాగౌడ్ చైర్మన్‌గా, బాలాపూర్ మాజీ సర్పంచ్ పారిజాతారెడ్డి భర్త చిగిరింత నర్సింహారెడ్డి వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ పాలకవర్గం ఉండగానే 2018లో దీనిని మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక 2019లో పాలకవర్గం పదవీకాలం ముగియగానే బడంగ్‌పేట్‌ను కార్పొరేషన్‌గా మార్చారు. 2020లో మునిసిపల్ ఎన్నికలు నిర్వహించగా కార్పొరేషన్‌కు మొదటి పాలకవర్గం కొలువుదీరింది. 32 డివిజన్లు ఉన్న బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్‌గా బాలాపూర్ మాజీ సర్పంచ్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఎన్నికవగా.. డిప్యూటీ మేయర్‌గా సైతం బాలాపూర్ మాజీ సర్పంచ్ ఇబ్రాం శేఖర్ ఎన్నికయ్యారు. ఒకే గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు మేయర్, డిప్యూటీ మేయర్లుగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఇక ప్రస్తుతం ఈ కార్పొరేషన్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో తొలి, చివరి మేయర్, డిప్యూటీ మేయర్లుగా సైతం వారిద్దరే రికార్డుల్లో నిలిచిపోనున్నారు. కార్పొరేషన్ సైతం మాయమై మొదటి, చివరి కార్పొరేషన్‌గా రికార్డుల్లోకి ఎక్కనుంది.

మరో 25 కిలోమీటర్ల వరకు కవర్ కండక్టర్: బలాల



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించేందుకు కొత్తగా ఏర్పాటు చేస్తున్న కవర్ కండక్టర్ తీగలను మరో 25 కిలో మీటర్ల వరకు ఏర్పాటు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, కన్‌స్ట్రక్షన్ డీఈ డీవీరెడ్డి, ఏడీఈ శాస్త్రీ, సీబీడీ ఇమ్రాన్, చంచల్‌గూడ, ఆస్మాన్‌ఘడ్ ఏడీఈలు శోభన్, శ్రీనివాస్‌రెడ్డి, మలక్‌పేట ఏఈలు సంతోష్‌బాబు, సాజుద్దీన్, ప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్‌పేట నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా ఉన్న విద్యుత్ తీగల స్థానంలో కవర్ కండక్టర్లతో కూడిన విద్యుత్ తీగలను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న విద్యుత్ తీగలను కూడా కవర్ కండక్టర్లుగా మార్చేందుకు రూ.4కోట్ల వ్యయంతో మరో 25కిలో మీటర్ల వరకు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలని ఎమ్మెల్యే బలాల ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో చావునీ, అక్బర్‌బాగ్ డివిజన్ల కార్పొరేటర్లు షాహిద్, మిన్హాజుద్దీన్, ఆజంపుర డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

సకల సదుపాయాలతో శ్మశానవాటిక అభివృద్ధి

● యెగ్గె మల్లేశం కురుమ

మన్సూరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాగోల్‌లోని హిందూ శ్మశానవాటికను సకల సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నట్లు నాగోల్ హిందూ శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ తెలిపారు. శ్మశానవాటిక ఆవరణలో సోమవారం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. శ్మశానవాటికలో శివుడి విగ్రహం ఏర్పాటుతో పాటు మరుగుదొడ్లు, స్నానపు గదుల ఏర్పాటుకు కమిటీ తీర్మానం చేసింది. అనంతరం యెగ్గె మల్లేశం కురుమ మాట్లాడుతూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను మంగళవారం నుంచి ప్రారంభించనున్నామని, అంత్యక్రియల నిమిత్తం వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు పల్లె సీతారాములు గౌడ్, ఉపాధ్యక్షుడు కట్ట ఈశ్వరయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి బద్ధం మహేందర్‌గౌడ్, కోశాధికారి ఇంద్రాల రమేష్‌గౌడ్, సభ్యులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, చెరుకు గణేష్‌గౌడ్, బద్ధం రామకృష్ణ, వస్పరి మల్లేష్, చెరుకు చిరంజీవి, డప్పు పోచయ్య, బొడ్డుపల్లి రాజు, సగ్గు శంకర్, పస్తం శ్రీరాములు, చిత్తుల అంజయ్య, నాగోల్ సుధాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టుల్లో నూతన న్యాయమూర్తుల పరిచయం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్లుగా బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు స్వర్ణమల్లిక, బానోతు కిరణ్ పరిచయ కార్యక్రమం సోమవారం రంగారెడ్డి జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగింది. జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతన న్యాయమూర్తులు స్వర్ణమల్లిక, బానోతు కిరణ్‌ను బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి బాసెట్టి కార్తీక్, మహిళా ప్రతినిధి ఉష, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మట్టపల్లి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్ర, గణపతి హోమాలు

మన్సూరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చతుర్వేద హవన సహిత జ్ఞాన యజ్ఞ మహోత్సవాలలో భాగంగా మూడో రోజైన సోమవారం రుద్ర, గణపతి హోమాలను ఘనంగా నిర్వహించారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ చేపట్టిన ఈ హోమాలతో పాటు ఇతర పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం భద్రాచల క్షేత్ర ఆస్థాన వేదపండితులు మురళీ కృష్ణమాచార్యుల ప్రవచనాలు ఉత్తేజపరిచాయి. నాగోల్ డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీ పార్కులో ధర్మరక్ష సంస్థ ఆధ్వర్యంలో జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీ అసోసియేషన్ సభ్యుల సహకారంతో చతుర్వేద హవన జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు కొనసాగుతున్నాయి.

28న 'కామినేని ఈస్ట్ హైదరాబాద్ హాఫ్ మారథాన్-2025'

మన్సూరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 28న ఎల్బీనగర్ రన్నర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో 'కామినేని ఈస్ట్ హైదరాబాద్ హాఫ్ మారథాన్-2025'ను నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో ఎల్బీనగర్ రన్నర్స్ గ్రూప్ సభ్యులు తెలిపారు. కామినేని ఆస్పత్రి వారు టైటిల్ స్పాన్సర్‌గా ఈసారి నిర్వహించే మారథాన్‌ను 5కే, 10కే, 16కే, 21కే కేటగిరీలుగా విభజించి వనస్థలిహిల్స్‌లోని యూనిసెంట్ పాఠశాల నుంచి ప్రారంభించి కుంట్లూరు గ్రామం గుండా చేపడుతున్నట్లు తెలిపారు. అటవీ, పోలీసు శాఖల ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న ఈ మారథాన్‌లో 2వేల మంది పాల్గొనే అవకాశం ఉందని, మారథాన్‌ను పూర్తి చేసిన వారికి మెడల్స్, బహుమతులు ఇస్తామేని తెలిపారు. ఈ మారథాన్‌లో రన్నర్స్, వాకర్స్, జాగర్స్ పాల్గొనవచ్చని, ఆసక్తిగల వారు https://www.ifinish.in/running/lbn2025 అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సీపీఎస్ అమలు చేయాలి

● ఓయూ రిజిస్ట్రార్, ఓఎస్‌డీకి వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అధ్యాపకులు సోమవారం ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలనా భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ప్రొఫెసర్లు చంద్రశేఖర్, శ్రీనివాసులు, కాశీం, లావణ్య, మల్లేశం, వెంకటలక్ష్మి, నాగేశ్వర్ సీపీఎస్ అమలు అత్యవసరాన్ని వివరించారు. ఏడాది నుంచి విద్య, పరిశోధన, మౌలిక సదుపాయాల్లో ఓయూ పురోగతి సాధించిందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు వీసీ కుమార్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. 20 ఏళ్లుగా సీపీఎస్ అమలు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అనంతరం రిజిస్ట్రార్, ఓఎస్డీ మాట్లాడుతూ ఎరియర్స్, సీఏఎస్, పదోన్నతులు వంటి అనేక సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని చెప్పారు. సీపీఎస్ అంశంపై వైస్ చాన్సలర్ సానుకూలంగా ఉన్నారని, త్వరలో పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'చార్మినార్'కు వ్యతిరేకంగా బీజేపీ సంతకాల ఉద్యమం

● బడంగ్‌పేట్‌ను ఎల్బీనగర్ జోన్‌లో చేర్చాల్సిందే: బీజేపీ



సంతకాలు సేకరిస్తున్న బీజేపీ నేతలు

సరూర్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా బీజేపీ క్లస్టర్-12 అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభించారు. ఆదివారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం సోమవారం సైతం కాలనీల్లో ఉధృతంగా నిర్వహించారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ సూచన మేరకు అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి డివిజన్ల వారీగా బృందాలను ఏర్పాటు చేసి సంతకాలు సేకరిస్తున్నారు. పలు ప్రధాన కూడళ్లలో టేబుళ్లు వేసుకుని కూర్చుని చార్మినార్‌లో కలవడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ వారి నుంచి సంతకాలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి బడంగ్‌పేట్‌ను చార్మినార్ జోన్ నుంచి తొలగించి ఎల్బీనగర్ జోన్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. జోన్ మార్చేదాకా తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని త్వరలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు పేర్కొన్నారు.

కొహెడాలో సంతకాల సేకరణ

హయత్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ సర్కిల్‌ను చార్మినార్ జోన్‌లో కలపడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కొహెడాలో సంతకాల సేకరణ చేపట్టారు. బీజేపీ సీనియర్ నాయకుడు కందాళ బల్‌దేవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రతోనే తుర్కయంజాల్ సర్కిల్‌ను ఎల్బీనగర్ జోన్‌లో కలపకుండా చార్మినార్ జోన్‌లో కలిపిందని అన్నారు. ఈ విషయంపై పార్టీలకు అతీతంగా అందరూ పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిది గ్రామాలలో దాదాపు 10 వేల సంతకాలను సేకరించి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి కల్పించుకుని తుర్కయంజాల్ సర్కిల్‌ను ఎల్బీనగర్ జోన్‌కు మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కందాళ బల్‌దేవ్‌రెడ్డి, భిక్షపతి, గర్క భాస్కర్, అమర్‌నాథ్‌గుప్తా, కానుగుల నరసింహ, సోమ చంద్రశేఖర్‌గుప్తా, ఖాజామీ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పారిజాతారెడ్డి తదితరులు

బడంగ్‌పేట్ ప్రజాభవన్‌లో క్రిస్మస్ వేడుకలు

సరూర్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని ప్రజాభవన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం యునైటెడ్ క్రిస్టియన్ చర్చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఏర్పడి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి వార్షికోత్సవ సంబరాలు సైతం జరుపుకున్నారు. బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి హాజరై అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టు బాలకృష్ణ, మనోహర్, అసోసియేషన్ ప్రతినిధులు ఇమ్మాన్యుయెల్, జాషువా, జయరాజ్, మునియా మోజెస్, లాజర్‌నాయక్, అరుణ్‌జ్యోతి, కిషోర్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

'ఎంవీఎస్ఆర్'లో సందడిగా 'అథ్లెమా-2025'

సరూర్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో 'అథ్లెమా-2025' పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ సందడిగా కొనసాగింది. పోటీల ముగింపు వేడుకలను సోమవారం కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన దాదాపు 100 జట్లు అథ్లెమా-25లో పాల్గొని పలు క్రీడా పోటీల్లో తలపడ్డాయి. ఆయా పోటీల్లోని విన్నర్స్, రన్నర్స్ జట్లకు సోమవారం ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వీవీఆర్ కశ్యప్, కార్యదర్శి డాక్టర్ కేపీ శ్రీనివాస్‌రావు, వైస్ చైర్మన్ సీతారాంబాబు, కోశాధికారి జూపూడి సుధాకర్, సంయుక్త కార్యదర్శి సూర్యప్రభాకర్, పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్‌లో ముగ్గురికి బంగారు పతకాలు

గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్‌లో ముగ్గురికి బంగారు పతకాలు

చాదర్‌ఘాట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల మహావీర్ విద్యాసంస్థలో నిర్వహించిన 6వ తెలంగాణ రాష్ట్ర గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్-2025లో ముగ్గురు బంగారు పతకాలను సాధించారు. వీరిలో రజా, కార్తీకవం, సక్రిత్రం బంగారు పతకాలను సాధించిన వారిలో ఉన్నారు. మహావీర్, అబ్దుల్లా, ధనుష్, ఫైజాన్‌ఖాన్, అతిఫ్‌హుస్సైన్, అమన్ అలీ వెండి పతకాలను సాధించగా మరో ఆరుగురు కాంస్య పతకాలను సాధించారని తెలంగాణ రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రూపేష్‌మల్, ప్రధాన కార్యదర్శి ఆదిముళ్ల కృష్ణ తెలిపారు.



జడ్పీహెచ్ఎస్‌లో విరబూసిన పూలతో ఆకర్షిస్తున్న ట్రంపెట్రీ

విరబూసి.. కనువిందు చేస్తోంది

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఓ వృక్షం విరబూసిన పూలగుత్తులతో కనువిందు చేస్తోంది. చూపరులను ఇట్టే ఆకర్షించేలా గులాబీ రంగులో చెట్టు కొమ్మలకు పూలగుత్తులు దర్శనమిస్తున్నాయి. చెట్టుకు బంతి ఆకారంలో పూలగుత్తులు మాత్రమే కనిపిస్తున్నాయి. చలికాలం డిసెంబర్‌లో మాత్రమే పూలు పూసే ఈ చెట్టు శాస్త్రీయ నామం టబెబూయా రోజియా కాగా పింక్ ట్రంపెట్రీ అని పిలుస్తారు. వారం రోజులుగా ఈ చెట్టు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులను కనువిందు చేస్తోంది.